క్లుప్తంగా

వరికోత యంత్రంలో పడి కొండ చిలువ మృతి



ఎల్కతుర్తి : మండల కేంద్ర శివారులో రైతు గొడిశాల రాజు గౌడ్ ఆదివారం వరి కోస్తుండగా ఆ మిషన్‌లో పడి ఒక భారీ కొండ చిలువ మృతి చెందింది. కొండ చిలువ ప్రత్యక్షం కావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కాగా అది వరి కోత మిషన్‌లో పడి మృతి చెందింది. కొండ చిలువ సుమారు 10 ఫీట్ల పొడవు ఉందని రైతు రాజు తెలిపారు. గతంలోనూ ఓ భారీ కొండచిలువ ఇలాగే ప్రత్యక్ష్యం కావడంతో రైతులు దాన్ని చంపేశారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ఆత్మకూరు : తాటి చెట్టు మీద నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నీరుకుళ్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు బత్తిని శంకర్ (40) ఆదివారం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు, గీత కార్మికులు చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్కతుర్తి : మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో ఏడుగురు పేకాటరాయుళ్లను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఎస్సై జక్కుల పరమేష్ కథనం ప్రకారం.. పక్కా సమాచారం మేరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్సై సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడుగురు పేకాటరాయుళ్లు పోలీసులకు పట్టుబడ్డారు. వారిని అరెస్ట్ చేసి రూ.2,150 నగదును, 4 సెల్ ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై చెప్పారు. అరెస్టైన వారిలో పెండ్యాల కిరణ్, ఆరెపల్లి వినోద్, మాడుగుల కోటి, మాటూరి శ్రీనివాస్, అంబాల శ్రావణ్‌కుమార్, సయ్యద్ అలీ, పెండ్యాల శ్రీకాంత్ ఉన్నట్లు ఎస్సై వివరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 1987–88 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము టెన్త్ చదువుకున్న పాఠశాలలో 35 ఏళ్ల తరువాత కలుసుకుని ఒకరినొకరు అప్యాయంగా పలుకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. తమకు టెన్త్‌లో విద్యాబుద్దులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ఆర్థికసాయం

వరంగల్ చౌరస్తా: ఆర్థికంగా వెనుకబడిన గౌరిశెట్టి శివసాయికి వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉన్నత విదేశీ విద్యా పథకం ద్వారా ఆర్థికసాయం అందజేశారు. వరంగల్ ఆర్ఎస్‌టీ రోడ్డులోని పట్టణ ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శివసాయికి మాజీ మేయర్, పట్టణ అధ్యక్షుడు గుండు ప్రకాశ్‌రావు రూ.10,116 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రావు మాట్లాడుతూ విదేశాలకు వెళ్లే నిరుపేద ఆర్యవైశ్యులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మల్యాల వీరమల్లయ్య, వెలిశాల ఆనంద్, సదాశివుడు, పాల మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాగు అప్పగింత

కాజీపేట: కాజీపేటలోని ప్రధాన రహదారిపై హ్యాండ్ బ్యాగును పోగొట్టుకున్న మహిళను గుర్తించి బ్యాగును ఓ హోంగార్డు ఆదివారం సాయంత్రం అప్పగించి నిజాయితీని చాటుకున్నారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కుమారస్వామికి ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద రహదారిపై హ్యాండ్‌బ్యాగు దొరికింది. ఈ విషయాన్ని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లి బాధిత మహిళను గుర్తించి బ్యాగు అందించారు. కుమారస్వామికి బాధిత మహిళా కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

కాజీపేట: కాజీపేట శివారు సోమిడిలోని భక్త మార్కండేయ ఆలయ ఆవరణలో అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజస్తంభాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. మంచికట్ల సాంబమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఉత్సవాల నిర్వహణకు రూ.5 లక్షలు విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుర్రపు కోటేశ్వర్, మంచికట్ల మురళిమోహన్, రాజేంద్ర ప్రసాద్, కరుణాకర్, ఆడెపు రాజేందర్ పాల్గొన్నారు.

కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి

● మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్

దామెర : మున్నూరుకాపు సంఘం బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ తెలిపారు. మండలంలోని సింగరాజుపల్లిలో సంఘం మండల అధ్యక్షుడు మెంతుల రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశానికి దేవయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మున్నూరుకాపు కులస్తులు విద్య, వైద్య, ఉద్యోగ, తదితర రంగాల్లోనూ వెనుకబడి ఉన్నారని చెప్పారు. కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఆ దిశగా సంఘం సభ్యులందరూ ఐక్యతతో కృషి చేయాలని సూచించారు. మున్నూరుకాపు సంఘం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. మున్నూరుకాపు కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెంటనే నిధులు మంజూరు చేయాలని, కులస్తుల ఇతర సమస్యలు పరిష్కరించాలని, రాజకీయాల్లో సరైన అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్నూరుకాపు కులస్తులు ఐక్యంగా ఉండడం ద్వారా సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడు మెంతుల రాజు మాట్లాడారు. త్వరలో అన్ని గ్రామాల్లో కమిటీలను ఎన్నుకుంటామని చెప్పారు. తద్వారా సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి పాటుపడతామని తెలిపారు. తదనంతరం దేవయ్యను నాయకులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో సంఘం నాయకులు గండా చంద్రమోహన్, మోహన్, కాశెట్టి సదానందం, మాదాసు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



దేవయ్యను సన్మానిస్తున్న నాయకులు

మహనీయుల స్ఫూర్తితోనే అభివృద్ధి

పరకాల : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల స్ఫూర్తితోనే దేశాభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు, రవీంద్రనాథ్ ఠాగూర్‌ల చిత్రపటాలకు శ్రీను, విజయ్‌పాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీను, విజయ్‌పాల్‌రెడ్డి మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు, రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి అనేక మంది మహనీయుల కృషి ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని చెప్పారు. అలాంటి మహనీయుల స్ఫూర్తిని కొనసాగించడంలో యువత పాత్ర కీలకమన్నారు. మహనీయుల స్ఫూర్తితో దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఏకు రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నక్క చిరంజీవి, బీఆర్ఎస్ నాయకుడు మార్క రఘుపతి, శనిగరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రాధాన్యం

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన నగరబోయిన భద్రమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమె వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరు చేయించిన రూ.65 వేల విలువైన లెటర్ ఆఫ్ కాన్సెంట్ (ఎల్ఓసీ)ని భద్రమ్మ కుటుంబీకులకు హనుమకొండలోని తన నివాసంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఆదివారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటే సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్టు తెలిపారు. పేదలు వైద్యం కోసం అప్పు చేసి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. పేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు సావురే రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

అర్చకుడు అనుదీప్ శర్మకు జాతీయస్థాయి పురస్కారం



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు అనుదీప్ శర్మ జాతీయ స్థాయి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. గంగానది పుష్కరాల సందర్భంగా ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో తార ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఉగాది పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో అనుదీప్ శర్మకు ఉత్తమ జాతీయ కాలసర్ప దోష పురోహిత రత్న బిరుదుతోపాటు సువర్ణకంకణాన్ని ఆ రాష్ట్ర మంత్రి, హరిద్వార్ ఎమ్మెల్యే మదన్ కౌశిక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అనుదీప శర్మను స్థానిక సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి, ఎంపీటీసీలు మాచర్ల మంగమ్మ రవి, వావిలాల వేణుగోపాల ప్రసాద్, పురోహితులు పల్నాటి జలంధర్ తదితరులు అభినందించారు.

భజన మండలికి అభినందనల వెల్లువ

పరకాల : రామదాసు భజన మండలికి అభినందనలు వెల్లువెత్తాయి. మండలంలోని వెల్లంపల్లి గ్రామంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయంలో తెలంగాణ రాష్ట్ర సేవా సొసైటీ ఆధ్వర్యంలో రామదాసు భజన మండలి కళాకారులు ఆదివారం నిర్వహించిన భజన మేళా భక్తులను ఆకట్టుకుంది. శివుని, రాముని, హనుమంతుడి వివిధ దేవతారాధన నామ సంకీర్తన భజన పాటలు, కోలాట బృందాలు వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో చేరుకోగా స్థానిక సర్పంచ్ వెలగందుల కృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భజన పాటలు, కోలాటం బృందాల ప్రదర్శనలతో ప్రతిభ కనబర్చిన కళాకారులను నిర్వాహకులు ప్రశంసపత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రామదాసు భజన మండలి తెలంగాణ రాష్ట్ర సేవా సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సిద్దేశ్వర్, వెలగందుల సదానందం, దామెర చంద్రమౌళి, గండ ఆదిరెడ్డి, తాళ్ల మురళీ, మూగ గోపినాథ్ శర్మ, బస్వా శ్రీనివాస్, ఓదెల మల్లయ్య, నల్ల ధర్మారెడ్డి, కన్నా సాంబయ్య, మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



భజనమేళాలో కళాబృందాలు

కాంగ్రెస్ నాయకుడిపై దాడి అమానుషం

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ టేకుమట్ల మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్‌పై అధికార పార్టీ నాయకుల దాడి అమానుషమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్యాయానికి గురైన పేదల ప్రజల పక్షాన నిలిచినందుకే సతీష్‌గౌడ్‌పై దాడి చేశారని మండిపడ్డారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని టేకుముట్ల మండల పరిధిలోని రామకృష్ణాపూర్ (టీ) గ్రామానికి చెందిన దళిత కాలనీకి చెందిన మాల కులస్తుల ఇళ్ల స్థలాలను మాజీ ఎంపీపీ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకోగా బాధితుల పక్షాన సతీష్‌గౌడ్ పోరాడుతుండగా రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులకు పాల్పడి అతన్ని హత్యాయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చిందం రవి, చింతల రవిపాల్, మాదిరెడ్డి ప్రపంచరెడ్డి, మారపల్లి రాజు, కట్టయ్య, కట్టయ్య, రఫీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దూదిపాల బుచ్చిరెడ్డి

రైతుల మనుగడకు గోసంరక్షణ కీలకం

ధర్మసాగర్ : రైతులు మనుగడ సాగించడంలో గోవుల సంరక్షణ కీలకమని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ తెలిపారు. మండలంలోని పీచర గ్రామంలో శ్రీలక్ష్మీ గోశాల ఆధ్వర్యంలో 10 మంది రైతులకు 20 లేగ దూడలను ఆదివారం ఆయన ఉచితంగా పంపిణీ చేసి మాట్లాడారు. రైతులు గోవులను సంరక్షించాలని కోరారు. సేంద్రీయ వ్యవసాయంతో ఆరోగ్యకర సమాజ నిర్మాణ సాధ్యమౌతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మ్యాక రవీందర్, తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాడిపల్లి రాజేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ దుర్గం రోజా, గోశాల ప్రతినిదులు సుధాకర్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



దూడలను పంపిణీ చేస్తున్న మహేష్, తదితరులు

బాధిత కుటుంబానికి రూ.50 వేల సాయం



ఎల్కతుర్తి : మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు గాజుల అయిలయ్య ఇటీవల మృతి చెందగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అందించిన రూ.50 వేల నగదును ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి ఆదివారం అందజేసి మాట్లాడారు. అయిలయ్య మృతి బాధాకరమన్నారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు బీజేపీ అండగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఆడెపు శ్రీవర్ధన్, జనగాని కిష్టయ్య, కొరె కార్తీక్, పల్లెపాటి మధుకర్, వీరమళ్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధే ధ్యేయం

మామునూరు: విలీన గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. వరంగల్ 17వ డివిజన్ పరిధిలోని గాడిపెల్లి గ్రామంలో కార్పొరేటర్ గద్దె బాబుతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రెయినేజీలు, పాత గ్రామ పంచాయతీ భవన సముదాయం, హనుమాన్, రామాలయ నిర్మాణాల కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. హనుమాన్, రామాలయ నిర్మాణాల కోసం స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దామోదర్, బెంబిరి బాబురావు, పోచన స్వామి పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఖిలా వరంగల్: వేసవిలో గుక్కెడు తాగునీటి కోసం తల్లాడిపోతున్నామని, తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని భూపేష్‌నగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ 34వ డివిజన్ శివనగర్ భూపేష్‌నగర్ కాలనీ రోడ్డుపై స్థానిక మహిళలు కాలి బిందెలతో ఆదివారం నిరసన తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ నాయకుడు గోరంటల శరత్ బాబు మాట్లాడుతూ పైపులైన్ ద్వారా సరఫరా జరిగే తాగునీటిపై కాలనీవాసులు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వేసవిలో బావులు, బోర్లు ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంతి, స్పందన, సరళ, అనిత తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నేడు రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ

శాయంపేట : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మిర్చి, మొక్కజొన్న పంట నష్టం వాటిల్లిన క్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధిత రైతులకు మంజూరైన పరిహారం చెక్కులను నేడు మండల కేంద్రంలోని రైతు వేదికలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు. శాయంపేటలో 22, పత్తిపాకలో 7, హుస్సేన్‌పల్లి 12, గట్లకానిపర్తిలో 108, తహరాపూర్‌లో 10 మంది మిర్చి రైతులకు పరిహారం చెక్కులు మంజురైనట్టు తెలిసింది. అలాగే కొత్తగట్టు సింగారంలో 64, తహరాపూర్‌లో 7, గట్లకనిపర్తిలో 11, శాయంపేటలో 66, పత్తిపాకలో ఇద్దరు, పెద్దకొడెపాకలో ఒక మొక్కజొన్న రైతుకు పరిహారం చెక్కులు మంజూరయ్యాయని సమాచారం. బాధిత రైతులకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా చెక్కులు అందజేయనున్నట్లు అధికారులు వివరించారు.

నిరుపేద మహిళ ఇల్లు కూల్చడం సరికాదు



నిరాహార దీక్షలు చేస్తున్న బాధితులకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

వరంగల్: నగరంలోని 13వ డివిజన్ ఎంహెచ్‌నగర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన దామెర అశోక్, మైబు దంపతుల ఇంటిని కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కూల్చివేసి అందులో పార్టీ జెండాను నిర్మించడం సరికాదని బీజేపీ నాయకుడు సముద్రాల పరమేశ్వర్ అన్నారు. ఇళ్లు కూల్చి జెండా గద్దెను కట్టిన స్థలంలో నిరాహార దీక్షలు చేస్తున్న అశోక్, మైబు దంపతులకు ఆదివారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద మహిళ మైబుకు చెందిన 60గజాల స్థలాన్ని కబ్జా చేసి తిరిగి అడిగేందుకు వచ్చిన క్రమంలో పార్టీ జెండా ప్రత్యక్షమవడం దారుణమని వాపోయారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ప్రవీణ్, పోలెపాక మార్టిన్ లూథర్, మాదాసు రాజు, పిట్ట సరస్వతి, యువ మోర్చా నాయకులు బైరి హరీష్, గోవింద్ సింగ్, కోమాకుల నాగరాజు, కోట సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

11న బొమ్మల కట్టయ్య వర్ధంతి



బొమ్మల అంబేడ్కర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కరీమాబాద్: ఈనెల 11న నిర్వహించనున్న భారతీయ బౌద్ధ మహాసభ జాతీయ కార్యదర్శి, అంబేడ్కర్ వాది బొమ్మల కట్టయ్య రెండవ వర్ధంతిని విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మల అంబేడ్కర్, అంబేడ్కర్ భవన కమిటీ అధ్యక్షుడు నీలం మల్లేషం పిలుపునిచ్చారు. కరీమాబాద్ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో అంబేడ్కర్ సంఘాలను విస్తరించేందుకు కట్టయ్య ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. కరీమాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు. కాగా, రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన అంబేడ్కర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎరుకల మహేందర్, తరాల రాజమణి, కడారి కుమార్, భిక్షపతి, శంకర్, గౌతం, సిద్ధార్థ, రాంప్రసాద్, రవితేజ, దామోదర్, సుధాకర్, సురేష్, విక్రమ్, వినోద్, శివ, నాగమణి, సౌజన్య, మనోహర, శ్రీదేవి పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

హసన్‌పర్తి: మండలంలోని అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో నేడు (సోమవారం) విద్యార్థినుల బైక్ ర్యాలీ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. హనుమకొండలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి ఉదయం 9 గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నయీంనగర్ మీదుగా ఎర్రగట్టుగుట్ట వరకు సాగుతుందని తెలిపారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట ఏసీపీలు పాల్గొననున్నట్లు చెప్పారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

హన్మకొండ అర్బన్: ప్రతీఒక్కరు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత అన్నారు. నగరంలోని కనకదుర్గ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో రికార్డ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన, చిరుధాన్యాల వల్ల ఉపయోగాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలను రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకోవాలని చెప్పారు. వాటిలోని పోషకాల వలన ఆరోగ్యానికి మేలు కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో రికార్డ్ సేవా సంస్థ బాధ్యులు కుసుమ కవిత, కుసుమ సురేష్, ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, కనకదుర్గ కాలనీ కార్యదర్శి నారాయణ, వీఆర్ విద్యార్థి, వనం వెంకటేశ్వరరావు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



చిరుధాన్యాలను ప్రదర్శిస్తున్న కార్పొరేటర్ వసంత, ప్రతినిధులు

తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకోవాలి

హన్మకొండ చౌరస్తా: అక్రమంగా తొలగించిన పెట్రోల్ బంక్ కార్మికులను వెంటనే తిరిగి పనిలోకి తీసుకోవాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సారంగపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని విశ్వేశ్వర సర్వీస్ స్టేషన్ (హిందూస్తాన్ పెట్రోలియం)లో ఆవరణలో కార్మికులతో కలిసి ఆదివారం నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ 30ఏళ్లుగా పనిచేస్తున్న సుమారు 20మంది కార్మికులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించడం సరికాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి పనిలో నుంచి తొలగించిన కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవడంతో పాటు పనిభద్రత, ఈఎస్ఐ, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెట్రోల్ బంక్ కార్మిక సంఘం నాయకులు మంద యాక నారాయణ, దయానంద్, కాశబోయిన కొమురయ్య, బుర్ర గోవర్దన్, వెంకటేష్, శ్రీనివాస్, రేవంత్, సరళ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బాధిత కార్మికులు

కాలనీలను అభివృద్ధి చేసుకుందాం

ఖిలా వరంగల్: వెనకబడిన కాలనీలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని శంభునిపేట, రంగశాయిపేట కాలనీల డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు కర్నె రవీందర్, రామానుజం జగదీశ్వర్ సూచించారు. ఈమేరకు వరంగల్ – ఖమ్మం రోడ్డులోని సిల్వర్ క్రోస్ పాఠశాల ప్రాంగణంలో నాగబండి శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నగర మేయర్ గుండు సుధారాణి, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సహాయ సహకారాలతో రోడ్లు, డ్రెయినేజీలను అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, శ్రీనివాస్, కవిత, బూర హరిప్రసాద్, ప్రహ్లాద్‌రావు, అశోక్, రవి, తదితరులు పాల్గొన్నారు.

భరోసా సభకు తరలిన బీఎస్పీ నాయకులు

హసన్‌పర్తి: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ భరోసా సభకు వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు చాతళ్ల వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. కార్యకమంలో పీపీఎల్ రాష్ట్ర కన్వీనర్ చాతళ్ల సదానందం, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బండి ఓంకార్, మండల అధ్యక్షుడు మెరుగు కృష్ణగౌడ్, నాయకులు మేకల అభినేష్, పవన్‌కళ్యాణ్, హరికృష్ణ పాల్గొన్నారు.

సభకు తరలిన బీఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు

కేయూ క్యాంపస్: బీఎస్పీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ భరోసా బహిరంగ సభకు బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ ఆధ్వర్యంలో కేయూ నుంచి పలువురు విద్యార్థులు తరలివెళ్లారు. బీఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు కట్కూరు సునీల్, కేయూ అధ్యక్షుడు మాసం సల్మాన్, బాధ్యులు సాయికుమార్, శ్రవణ్ తదితరులు వెళ్లారు.